మంచి కవితతో కొంచెం సేపు

విన్నకోట రవిశంకర్



# కాన్వాసుపై ఆమె

వి.ఆర్.విద్యార్థి

## నెలనెలా ఒక మంచి కవితాపరిచయం

అమెరికా వ్యతిరేకత ప్రకటించే కవితలు తెలుగులో విరివిగానే వచ్చాయి. ఇటీవలి కాలంలో అవి అనేక రెట్లు పెరిగాయి కూడా. ఇటువంటి వాతావరణం బలంగా ఉన్నప్పుడు, అమెరికాకి పర్యాటకులుగా వచ్చిన కవులు కూడా ఇదే దృష్టితో స్పందించే అవకాశం లేకపోలేదు. ఉదాహరణకు, ఒకసారి తానా సభలకోసం వారి ఆహ్వానం మీద వచ్చిన ప్రముఖ కవి ఒకరు, తాను వచ్చేముందు, "మీరు అమెరికా ఎందుకు వెళుతున్నారు?" అని ఎవరో అడిగితే "ఒక మహా సర్పాన్ని చూడటానికి వెళుతున్నా"నంటూ సమాధానమిచ్చానని చెప్పారు. ఐతే, భారత ప్రభుత్వ విధానాలెలా మారినా, అవి హిమాలయాల ఔన్నత్యాన్ని, గంగానది పవిత్రతనూ ప్రభావితం చెయ్యలేనట్లే, అమెరికా ప్రభుత్వ విధానాల వల్ల ఇక్కడి ప్రకృతి సౌందర్యం పనికిరాకుండా పోదు గదా. అందువల్ల, తమ అభిప్రాయాలకతీతంగా, సమ్మోహపరిచే ఇక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించి, స్పందించటం కవులకు వాంఛనీయమనిపిస్తుంది. అమెరికాలో అతిథిగా కొన్ని నెలలు గడిపిన వి.ఆర్.విద్యార్థి గారు ఇక్కడి ప్రకృతితో మమేకమై, ధ్యానంతో, అన్వేషణతో, సౌందర్య దృష్టితో రాసిన కవితలు ఈ కారణం వల్లనే నన్ను విశేషంగా ఆకర్షించాయి. ఆయన ఇటీవల వెలువరించిన "మంచు మైదానం" కవితా సంపుటిలో ఇటువంటి కవితలు కొన్ని కనిపిస్తాయి. వీటిలో "కాన్వాసుపై ఆమె" అన్న కవిత పేర్కొనదగింది.

విద్యార్థి గారి కవితల్లో ఒక రకమైన "భ్రమణ కాంక్ష" ఉంటుంది. ఆయన వెలువరించిన వివిధ సంకలనాలలో ఉన్న కవితలు వివిధ ప్రదేశాల్లో ఉండగా రాసినవి. యాత్రకు వచ్చిన వారిని, ప్రముఖమైన యాత్రా స్థలాలు ఆకట్టుకోవటం , కవులైతే వాటి గురించి కవితలు రాయటం సహజమే. ఇలా రాసిన కవితల నాణ్యత, రాసిన వారి స్థాయినిబట్టి మారుతూ ఉంటుంది. కొన్ని ఒక మోస్తరుగా ఉంటే, మరి కొన్ని చుట్టుకొలతలు, గణాంకాలు చెప్పటానికే పరిమితమైపోతాయి. వీటికి భిన్నంగా, ఈ కవిత ఒక ప్రాకృతిక సంఘటన గురించి రాయబడింది. ఇందులో వస్తువు మంచు తుఫాను. దానిని కూడా ఒక సౌందర్య దృష్టి, మార్మికత కలగలిపి ఈ కవిత ఆవిష్కరిస్తుంది. అదే దీని ప్రత్యేకత.

ఇందులో ఎన్నో మంచి పద చిత్రాలున్నాయి. "ఆకాశం హిమసమూహమై భూమ్మీదికి దిగిరావటం","అడవంతా మంచుతో వెండి పందిళ్ళల్లుకోవటం", "గువ్వ ఆమె ఆగమనాన్ని తన భాషలో అభినందిందించటం" వంటివి చాలా సున్నితమైన భావనలు. కవిత నిడివి ఎక్కువటం నిజమే గానీ, కవి మాట్లాడుతున్నట్టుగా కవితను రూపొందించటం బహుశ దానికి కారణం కావచ్చు. ఐతే, ఇందులో కవి నిరీక్షిస్తున్న ఆమె ఎవరన్నది చివరి వరకూ రహస్యంగానే ఉండిపోతుంది. దీనిని పాఠకుల ఊహకు వదిలిపెట్టటమే సమంజసమనుకుంటాను.

అమెరికా గురించి వచ్చే కవితలకి, ఇతర యాత్రా కవితలకీ భిన్నంగా ఉండటం, మంచు తుఫానుని సౌందర్యాత్మకంగాచెప్పటం, అందులో ఒక ఆత్మీయ మూర్తిని దర్శించటం ఈ కవితకు ప్రత్యేకతను చేకూర్చుతున్నాయి.

కవిత పూర్తి పాఠం :

ఆకురాలు కాలంగదా!
అడవంతా నగ్నంగా
చెట్లన్నీ పొరకలై
పాడుబడ్డదీ కాదు.
ఆకాశం
హిమసమూహమై
భూమ్మీదికి
దిగివస్తోంది.
అది పట్టపగలు..
పసిడి బింబం ఒకటి
హరితాన్ని ధరించిన వసంతమై
ఆ లోయలబడి
ఈ కొండవైపు వస్తోంది.
కొండమీద నిరీక్షిస్తున్న నేను
ఆమె రాకను గుర్తించాను.
సంభ్రమాశ్చర్యాల
జలదరింపులు నాలో.
ఆమె నాకోసంగాక
ఇంకెవరికోసం వస్తుంది!?
నా నిరీక్షణ
ఆమె కోసంగాక
ఇంకెవరికోసం!?
ఈకవికి గాక
ఇంకెవరికి తెల్సు ఆమె ఆంతర్యం!?
వేరెవరికుంటుంది
ఆమెను స్వాగతించే స్పృహ, జాగరూకత!?
ఆమె వస్తోంది
తన అపూర్వ స్నేహితుడికోసం వస్తోంది..
అడవంతా మంచుతో

వెండిపందిళ్ళల్లుకొంటోంది.

దూరంగా

మంచుపొదల మాటున

అల్లుకున్నగూటిలో

వెచ్చగా విశ్రమిస్తున్న గువ్వొకటి

నా నిరీక్షణను

ఆమె ఆగమనాన్నీ

తన భాషలో అబినందిస్తోంది.

దట్టమౌతున్నది మంచుతుఫాను.,

లోయంతా

సాగరరూపమెత్తింది

పొగచూరిన అడవంతా

మంచులో ఒక కొత్త కాన్వాసుగా మారింది.

ఆ కాన్వాసుపై

ఒకే ఒక చిత్రం-

ఆమె నాకు సుపరిచిత

ఆత్మీయ

ఆ మానిని దగ్గరవుతోంటే

నాలో చెప్పలేని ఉద్విగ్నత

ఆమె వచ్చేస్తోంది,,

మేమిద్దరమూ

ఎంతో ముచ్చటించుకోవాలి

ఎంతెంతో

ప్రేమించుకోవాలి

విశ్వపు అంచులదాకా

విస్తరించాలి

ఖగోళపు గుహాలు

ధ్వనించేంత దూరం

ఒక హాసమై వికసించాలి

అబ్బో!

ఎన్నేళ్ళ ఎడబాటు

అప్పుడెప్పుడో

చిన్నతనం గదా
ఎక్కడో
వేల మైళ్ళ దూరంలో
హిమాలయాలలో
ఒక నిశీధి వీధుల్లో
నిశ్శబ్దమై నడుస్తున్నప్పుడుగదా!
తప్పిపోయాం
ఇదిగో
మళ్ళీ ఇప్పుడు
ఇన్నాళ్ళకు కలుసుకుంటున్నాం..
వచ్చేసింది ఆమె
నన్నావహిస్తోంది
ఇప్పుడిక
నేను నేనుగా
ఆమె ఆమెగా
ఉండటం కుదరదు

- వి.ఆర్.విద్యార్థి

